

ఐదు గేట్లు ఎత్తివేత

వంగర: వర్షాలు కురుస్తుండడంతో సువర్ణముఖి, వేగావతి నదుల్లో నీటిప్రవాహం పెరిగింది. 11వేల క్యూసెక్కుల నీరు మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టుకు చేరుతోంది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఐదు గేట్లను ఎత్తివేసి వచ్చిన నీటిని కిందకు విడిచిపెడుతున్నట్టు ఏఈ నితిన్ సోమవారం తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టు వద్ద 64.21 మీటర్లు లెవెల్ నీటిమట్టం నమోదైంది.

ఎస్పీకి 46 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు 46 ఫిర్యాదులు వచ్చినట్టు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలంటూ సంబంధిత అధికారులకు ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, డీసీఆర్‌బీ సీఐ జె.మురళి, ఎస్‌బీ సీఐలు కేకేవీ విజయనాథ్, ఎ.వి.లీలారావు, ఎస్‌ఐ మురళీ, తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

న్యూస్‌రీల్

బిత్రపాడులోనే ఏనుగుల గుంపు



బిత్రపాడు పంట పొలాల్లో ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు, బట్లభద్ర, నిమ్మలపాడు పంట పొలాల్లో ఏనుగులు సోమవారం ఉదయం దర్శనమిచ్చాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పామాయిల్ తోటలో ఉండి గుమ్మిడిగెడ్డ వాగులోకి జారుకున్నాయి. సాయంత్రానికి నిమ్మలపాడు నుంచి బిత్రపాడు పరిసర ప్రాంతాల్లోకి చొచ్చుకువచ్చాయి. చీకటి పడిన సమయంలో గ్రామంలోకి ఏనుగులు వస్తాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అటవీ సిబ్బంది ఏనుగులను తరలించే ప్రయత్నం చేయాలని కోరుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట

- ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురంటౌన్: ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తున్నట్లు ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను ఎస్పీ స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకుని ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. కుటుంబకలహాలు, సైబర్ మోసాలు, భర్త, అత్తారింటి వేధింపులు, భూ వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసం, ప్రేమపేరుతో వంచన, ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా విన్నవించుకోగా, వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో ఎస్పీ మాధవ్‌రెడ్డి స్వయంగా ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించారు. వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదులపై చట్ట పరిధిలో తక్షణమే చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. మొత్తం 10 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించగా డీసీఆర్‌బీ సీఐ బీఎండీ ప్రసాద్‌రావు, డీసీఆర్‌బీ ఎస్సై పాపారావు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

మత్తుతో చిత్తు కావద్దు

- యువతకు ఏఎస్పీ హితవు



కొత్తవలసలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఏఎస్పీ సురాన అంకిత్ మహవీర్


పాచిపెంట: యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఏఎస్పీ సురాన అంకిత్ మహవీర్ హితవు పలికారు. ఈ మేరకు సోమవారం ఆమె పాచిపెంట మండలంలోని కొత్తవలస గ్రామంలో గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలకు అలవాటు పడి యువత భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత, నిరుద్యోగులు తగాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. సదస్సులో చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక ఉన్నత పాఠశాలలో గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు. అంతకుముందు పి.కోనవలస చెక్‌పోస్టును ఆమె సందర్శించి సిబ్బందిని అప్రమత్తం చేశారు. పాచిపెంట పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఆమె వెంట సీఐ రామకృష్ణ, రూరల్ ఎస్సై మూర్తి, హెచ్‌సీ కృష్ణారావు తదితరులు ఉన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

- పోలీసుల అదుపులో కొనుగోలు చేసిన మరో ముగ్గురు వ్యక్తులు

నెల్లిమర్ల: నెల్లిమర్ల పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను నెల్లిమర్ల పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వారితో పాటు గంజాయి కొనుగోలు చేసిన మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్టు భోగాపురం సీఐ జి.రామకృష్ణ తెలిపారు. పూడమ్మతల్లి వనంగుడికి వెళ్లే దారిలో విజయనగరానికి చెందిన దువ్వ సుబ్బు, వానపల్లి బలరాం అనే వ్యక్తులు గంజాయి విక్రయిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ఎస్సై రామ గణేష్ ఆధ్వర్యంలో దాడి చేసిన పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి కేజీపావు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి కొనుగోలు చేసిన మరో ముగ్గురిని కూడా అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచినట్టు సీఐ తెలిపారు.

నిండుకుండలా జలాశయాలు



తోటపల్లి ప్రాజెక్టు

- ప్రభావం చూపని వాయుగుండం
- ఎగువన కురుస్తున్న వర్షాలతో చేరుతున్న వరద నీరు

సాక్షి, పార్వతీపురం మన్యం: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం జిల్లాపై అంతగా ప్రభావం చూపలేదు. జిల్లా అంతటా ఓ మోస్తరు వానలే కురిశాయి. ఎగువన కురుస్తున్న వర్షాలతో వరద నీరు భారీగా రావడంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమై ముందస్తు చర్యలు తీసుకుంది. ఒడిశాలో కురుస్తున్న వర్షాల కారణంగా జిల్లాలోని పలు ప్రాజెక్టులు, నదులకు భారీగా వరద నీరు చేరుతోంది. దీంతో ముందు జాగ్రత్తగా అధికారులు తోటపల్లి, పెద్దగెడ్డ, వట్టిగెడ్డ, వెంగళరాయ సాగర్‌ల నుంచి నీటిని విడిచిపెడుతున్నారు. వాగులు, నదుల వద్దకు ఎవరూ వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. జియ్యమ్మవలస మండలంలోని తోటపల్లి ముంపు గ్రామం బాసంగి, కొమరాడ మండలంలోని జంఝావతి, నాగావళి నదీ తీర ప్రాంతాలైన కూనేరు, పూర్ణపాడు, కళ్లికోట, దుగ్గి తదితర గ్రామాలు.. పాలకొండ మండలంలోని ఓనిగెడ్డ, వరహాలరెడ్డ సమీప ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్లు, పోలీసు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

ప్రాజెక్టు	పూర్తి నీటి సామర్థ్యం (మీటర్లు)	ప్రస్తుత నీటి సామర్థ్యం(మీటర్లు)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	అవుట్‌ఫ్లో (క్యూసెక్కులు)
తోటపల్లి ప్రాజెక్టు	105	103.98	2530	1260
వట్టిగెడ్డ రిజర్వాయర్	121.62	117.59	228	225
పెద్దగెడ్డ	213.80	213.50	120	120
వెంగళరాయసాగరర్	161	160.25	300	300
పెదంకలాం ఆనకట్ట	-	-	300	300
జంఝావతి రిజర్వాయర్	-	122.60	328	328

వర్షపాతమిలా..

జిల్లాలో సాధారణ వర్షపాతం 14.5 మి.మీ కాగా.. ఈ నెల 1, 2 తేదీల్లో 39.7 మి.మీ కురిసింది. ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకు జిల్లాలో సగటు 9.4 మి.మీ వర్షపాతం నమోదు కాగా..అత్యధికంగా భామిని 27.6 మి.మీ, కురుపాం 20.6, సాలూరు 14.8, పాలకొండ 14.2, గుమ్మలక్ష్మీపురం 10.4 మి.మీ చొప్పున వాన కురిసింది. ఈ నెల 6, 7వ తేదీల్లో బంగాళాఖాతంలో మరో తుపాను ఏర్పడే ఆస్కారం ఉందని..దీని ప్రభావం ఉత్తరాంధ్రపై అధికంగా ఉంటుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మండలస్థాయి అధికారులను జిల్లా యంత్రాంగం అప్రమత్తం చేసింది. నదులు, వాగులు నిండి ఉండడం వల్ల భారీ వర్షాలు కురిస్తే గట్లు తెగిపోయే ప్రమాదం ఉంటుందని..తగు జాగ్రత్త చర్యలతో సిద్ధంగా ఉండాలని మండల అధికారులకు సూచనలు జారీ చేస్తున్నారు.



జలకళతో వెంగళరాయసాగర్

ఫలించిన పోరాటం

- మళ్లీ విధుల్లోకి గిరిజన ఉద్యోగులు

సాక్షి, పార్వతీపురం మన్యం: కొద్దిరోజుల క్రితం తొలగింపునకు గురైన ఏకలవ్య పాఠశాలల్లోని పలువురు బోధనేతర సిబ్బందిని తిరిగి విధుల్లోకి తీసుకుంటూ ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు వారికి ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యాలయాల్లో పోస్టింగులిచ్చారు. 2019 ఎన్నికలకు ముందు హడావుడిగా ఏకలవ్య పాఠశాలలను ప్రారంభించి..బోధనేతర సిబ్బందిని ఒప్పంద, పొరుగుసేవల ప్రాతిపదికన నియమించారు. సుమారు నెల రోజుల క్రితం ఈ పాఠశాలల్లో బోధన, బోధనేతర సిబ్బంది పోస్టుల భర్తీకి కేంద్రం నోటిఫికేషన్ ఇచ్చింది. అప్పటివరకు పని చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్, జూనియర్ సహాయకులు తదితర ఉద్యోగులను తొలగించారు. జిల్లాకు సంబంధించి పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో ఐదుగురు, సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఇద్దరు ఉద్యోగాలు కోల్పోయారు. అప్పటి నుంచి గిరిజన సంఘాల ఆధ్వర్యంలో వీరు పోరాటం చేస్తున్నారు. ఎట్టకేలకు వారిని 2024–25 సంవత్సరానికి జిల్లాలోని ఏపీటీడబ్ల్యూఆర్ సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో భర్తీ చేస్తూ సోమవారం సంబంధిత విభాగం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో తమ పోరాటం ఫలించిందని..బాధిత ఉద్యోగులకు న్యాయం చేకూరిందంటూ గిరిజన సంఘం నాయకుడు పి.రంజిత్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

విద్యుత్‌షాక్‌తో బాలుడి మృతి

శృంగవరపుకోట: మండలంలోని మూలబొడ్డవర పంచాయతీ పరిధి మరుపల్లి గ్రామానికి చెందిన రంపాల శ్యామ్(4) అనే బాలుడు విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. తుఫాన్ కారణంగా సోమవారం ప్రభుత్వం సెలవు ఇవ్వడంతో ఇంటికి వచ్చి స్నేహితులతో ఆటలో నిమగ్నమయ్యాడు. ఈ క్రమంలో పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం వెనకాల దాక్కున్నాడు. ఆ స్తంభానికి అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై పడిపోయాడు. తల్లిదండ్రులు ఎస్.కోట ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

విపత్తులు ఎదుర్కొనే ప్రణాళిక అవసరం

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్ట్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: విపత్తులను మండల స్థాయిలోనే సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవసరమైన ప్రణాళికలు ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టరేట్ నుంచి మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో వర్షాలు, సంపూర్ణ పోషణ, గృహనిర్మాణం, పీజీఆర్‌ఎస్ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రమాదకర పరిస్థితులపై స్పష్టమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. మండలాల్లో చెరువుల పరిస్థితి, ప్రమాదకర వంతెనలు, కొండ చరియల వివరాలు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాల, ఆస్పత్రి భవనాలు, ఇళ్లను గుర్తించి అధిక వర్షాలు కురుస్తున్న సమయంలో అటువంటి భవనాల్లో ఎవరూ ఉండకుండా చూడాలని సూచించారు. వాతావరణ శాఖ అందిస్తున్న సమాచారం మేరకు ప్రజలను అప్రమత్తం చేయాలని చెప్పారు. రానున్న మూడు రోజుల్లో మరో తుఫాన్ వచ్చే ఆస్కారం ఉన్నట్లు సమాచారం వస్తోందని, పరిస్థితులకు అనుగుణంగా సంసిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు పనిచేయాలని, వర్మీకంపోస్టు ఉత్పాదన చేయాలని ఆదేశించారు. అక్టోబర్ 2 నుంచి జిల్లాలో 138 కేంద్రాలు పనిచేసేలా ఎంపీడీఓలు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కింద 5వేల జనాభా మించిన పంచాయతీలో పూర్తిగా సౌర విద్యుత్ వినియోగంలోకి వచ్చేలా చేస్తే కేంద్ర ప్రభుత్వం రూ.కోటి వరకు గ్రాంట్‌ను అందిస్తుందని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్‌ఎస్ శోభిక, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ జి.కేశవనాయుడు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి, విద్యాశాఖ ఎ.డి రమాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపోరాటానికి సిద్ధం

- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాక్షి ప్రతినిధి, విజయనగరం/సాలూరు: ప్రస్తుత టీడీపీ కూటమి పాలనపై ఆరునెలల వరకు వేచి చూడాలని తరువాత ప్రజల కోసం ప్రజల తరఫున ప్రజల వెంట ప్రజాపోరాటాలకు సిద్ధమవాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారని కావున త్వరలోనే తాము ప్రజాపోరాటాలకు దిగుతామని మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన సాలూరు పట్టణంలోని వైఎస్సార్ కూడలి వద్ద స్థానిక విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో కొంతమంది చిరుద్యోగులను తొలగించడం, పలువురు అధికారులు, సచివాలయ ఉద్యోగులను బదిలీపై వెళ్లిపోవాలని టీడీపీ నాయకులు బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల్లో మాత్రమే తమ పార్టీ నాయకులు, కార్యకర్తలకు తెలిసిన వ్యక్తులను నియమించాం కానీ..అంతకు ముందు టీడీపీ హయాంలో చేరిన ఉద్యోగస్తులను తొలగించలేదన్నారు. బీసీ, ఎస్సీ, మైనార్టీ తదితర వర్గాలకు 50 ఏళ్లకే పింఛన్ అందిస్తామని హామీ ఇచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం నేడు దానిని అమలు చేయకుండా ఉన్న పింఛన్లు తొలగిస్తోందని విమర్శించారు. అనర్హుల పింఛన్లు తొలగిస్తే స్వాగతిస్తామని, కక్షపూరితంగా అర్హుల పింఛన్లు తొలగిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.

ఉద్యోగులకు ఓపీఎస్ హామీ అమలు సాహసమే!

ఎన్నికలకు ముందు చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ హామీ ఇచ్చిన ఓల్డ్ పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్)ను నిజంగా అమలుచేస్తే అదొక సాహసమేనని, టీడీపీ కూటమి ప్రభుత్వం దాన్ని అమలుచేస్తే తాను భవిష్యత్తులో చట్టసభలకు పోటీ చేయబోనని మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర సవాల్ విసిరారు. తమ ప్రభుత్వం ఉన్నప్పుడు ఓపీఎస్ అమలు కష్టసాధ్యం కాబట్టే ప్రత్యామ్నాయంగా నాటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జీపీఎస్ (గ్యారెంటీడ్ పెన్షన్ సిస్టమ్) బిల్లు తీసుకొచ్చారన్నారు. ఇప్పుడా జీపీఎస్‌నే కేంద్ర ప్రభుత్వం యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్) పేరుతో అమలుచేయనుందని చెప్పారు.

సంక్షేమ పాలనకు చిరునామా.. వైఎస్సార్

మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు సోమవారం ఊరూరా జరిగాయి. మహానేతను ప్రజలు మనసారా స్మరించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో ఆయన జిల్లాకు చేసిన మేలును.. బడుగుబలహీన వర్గాలకు అందించిన సంక్షేమ పాలనను గుర్తుచేసుకున్నారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో జరిగిన వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాల్లో ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

- ఊరూరా వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు
- వివిధ సేవాకార్యక్రమాల్లో నిమగ్నమైన పార్టీ శ్రేణులు, అభిమానులు
- దేశంలోనే మహానేత పథకాలు ఆదర్శవంతం
- మళ్లీ రాజన్నరాజ్యం తెచ్చేందుకు కలిసికట్టుగా శ్రమిద్దాం
- జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర పిలుపు



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి, పార్టీ శ్రేణులు

పార్వతీపురం టౌన్/సాలూరు/పాలకొండ/చీపురుపల్లి: దేశంలోనే సంక్షేమ పాలనకు చిరునామాగా దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి చరిత్ర సృష్టించారని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర డిప్యూటీ కో ఆర్డినేటర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని చీపురుపల్లి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని వైఎస్సార్ విగ్రహానికి సోమవారం మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదలకు విద్య, వైద్యం సక్రమంగా అందినప్పుడే వారు ఆత్మస్థైర్యంతో ఎదుగుతారనే ఆశయంతో ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, 108, 104 సేవలు తీసుకొచ్చారన్నారు. దేశంలోనే ఆదర్శవంతంగా నిలిచిన అలాంటి ఎన్నో పథకాలను గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగించారని చెప్పారు. మహానేత ఆశయాలకు అనుగుణంగా పనిచేయాల్సిన బాధ్యత వైఎస్సార్‌సీపీ శ్రేణులపై ఉందన్నారు. ప్రతీ అంశంలోనూ పేదల పక్షాన పోరాడాలని పిలుపునిచ్చారు. అప్పుడే వైఎస్సార్‌కు ఘనమైన నివాళి అర్పించినట్లు అవుతుందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు కాకముందే వ్యవస్థలను నిర్వీర్యం చేసి రాష్ట్రంలోని పరిపాలన గాలికొదిలేసిందని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జిల్లా ప్రజలను జ్వరాలు వణికిస్తున్నా ప్రభుత్వ పెద్దలకు పట్టడంలేదని విమర్శించారు. విద్య, వైద్యంను పేదలకు అందకుండా నిర్వీర్యం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. వర్షాలపై కేంద్ర ప్రభుత్వం వారం రోజుల కిందటి నుంచే హెచ్చరిస్తున్నా పట్టించుకోనందువల్లే విజయవాడ, కృష్ణ, గుంటూరు జిల్లాల్లో 5 లక్షల మందికి పైగా వరదల్లో చిక్కుకుని ఆకలితో అలమటిస్తున్నారని ఆరోపించారు. తెలుగు జాతి ఉన్నంత వరకు మహానేత వైఎస్సార్ గుర్తుంటారని, సంక్షేమం అంటే ముందుగా ఆయనే గుర్తొస్తారని చెప్పారు.

పేదల గుండెల్లో వైఎస్సార్ ముద్ర

మహానేత వైఎస్సార్ పరిపాలనలో దేశ చరిత్రలో లేని సంక్షేమ పరిపాలన అమలు చేసి రాష్ట్ర ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. రైతుభరోసా, జలయజ్ఞం, ఆరోగ్యశ్రీ, ఉచిత విద్య వంటి ఎన్నో పథకాలు అమలు చేసి పేదలకు దేవుడిగా మారారన్నారు. పేదలు ఆరోగ్యశ్రీ పథకం కోసం ఇప్పటికీ మరిచిపోలేకపోతున్నారని, నిరంతరం వైఎస్సార్‌ను స్మరించుకుంటున్నారని చెప్పారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం హత్యలు, మానభంగాలు, వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులకే ప్రాధాన్యమిస్తోందని విమర్శించారు. మళ్లీ రాజన్న పరిపాలన తెచ్చేందుకు కలిసికట్టుగా కృషిచేద్దామన్నారు.



పార్వతీపురంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు



చీపురుపల్లిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



వైఎస్సార్ విగ్రహానికి గజమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, పార్టీ నాయకులు

వైఎస్సార్ చిరస్మరణీయుడు

దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి తెలుగు రాష్ట్రాల ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడని మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. సాలూరు వైఎస్సార్ కూడలి వద్ద వైఎస్సార్ విగ్రహానికి గజమాల వేసి నివాళులర్పించారు. ఆరోగ్యశ్రీ పథకంతో ప్రజలు గుండె చప్పుడుగా వైఎస్సార్ మారారని, ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25 లక్షలకు పెంచి పేదల ఆరోగ్యానికి మరింత భరోసా కల్పించారన్నారు. వైఎస్సార్ సంక్షేమ పాలన ఎన్నటికీ మరచిపోలేనిదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్‌ఛైర్మన్ వంగపండు అప్పలనాయుడు పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడు

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానాయకుడు దివంగతన ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి అని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పాలనతో ప్రజల గుండెల్లో చోటు సంపాదించారన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి పెద్దపీట వేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. మళ్లీ ఆయన పాలనను తెచ్చుకునేందుకు కలికట్టుగా పనిచేద్దామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ ఛైర్మన్ కొండపల్లి రుక్మిణి, మూడు మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత వైఎస్సార్

దివంతగ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి స్ఫూర్తి ప్రదాత అని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. పాలకొండ పట్టణంలో పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజకీయల్లో నూతన అధ్యాయం రాజశేఖరరెడ్డి పాలనగా కొనియాడారు. కార్యక్రమంలో నగర పంచాయతీ అధ్యక్షురాలు యందవ రాధాకుమారి, ఎంపీపీ బొమ్మాళి భాను, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు వెలమల మన్మథరావు, కనపాక సూర్యప్రకాష్‌రావు, తదితరులు పాల్గొన్నారు.